RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 71 | పేజీలు : 08 | గురువారం | 19-03-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



## షేక్ హ్యాండ్ పరస్పరం పలకరింపు

2

ఢిల్లీలో ఎదురుపడిన సీఎం రేవంత్ రెడ్డి, వైసీపీ నాయకురాలు రోజా

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి నితిన్ గడ్కరీని కలవడానికి పార్లమెంటుకు వచ్చిన రోజా

పార్లమెంట్ భవనంలో ఎదురుపడిన రేవంత్ రెడ్డి, రోజా

షేక్ హ్యాండ్ ఇచ్చి పరస్పరం పలకరింపు



2

## ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదు

ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇళ్లు ఇస్తాం

శాసన మండలిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, మంజూరు సమస్యలపై విపక్షాల ప్రశ్నలు

3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి



2

## హింసకు గురి చేశారు

లాకప్‌లో నన్ను శారీరకంగా, మానసికంగా హింసకు గురి చేశారు: అంబటి రాంబాబు

తనను 18 రోజులు సెంట్రల్ జైల్లో ఉండేలా చేశారన్న అంబటి

తన ఇంటిపై దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోలేదని మండిపాటు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శ




## భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

2

80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకున్న 'జగ్ లాడ్కీ'

పుజైరాలోని పోర్టులో లోడ్ అయిన 'జగ్ లాడ్కీ'

పుజైరాలో టెర్మినల్‌పై ఇరాన్ దాడి సమయంలో చమురు నింపుకుంటున్న 'జగ్ లాడ్కీ'

హైదరాబాద్ పల్స్,డెస్క్

భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కి' అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను పుజైరా పోర్టులో లోడ్ చేశారు. 'జగ్ లాడ్కి' మొత్తం పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది.ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ....



## 99.93% మంది ఓటేశారట!

2

కిమ్ మార్క్ ప్రజాస్వామ్యం..

నార్త్ కొరియా ఎన్నికల్లో కిమ్ కు 99.93% మంది ఓటేశారట!

ఆ 0.07% వ్యతిరేక ఓట్లపై సర్వత్రా ఆసక్తికర చర్చ

వ్యతిరేకంగా ఓటేసే స్వేచ్ఛ... కానీ ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే

కిమ్‌కు ఎదురులేదని మరోసారి నిరూపితమైన వైనం

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఉత్తర కొరియాలో ఇటీవల జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచాయి. దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ నేతృత్వంలోని 'వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా' ఏకంగా 99.93% ఓట్లతో భూనభోంతరాలన్నీ దద్దరిల్లేలా 'మహా విజయాన్ని' నమోదు చేసింది. ఈ అపురూపమైన విజయంతో కిమ్ వరుసగా మూడోసారి అధికార పగ్గాలు...



"సభలో వివిధ అంశాలపై చర్చలు జరుగుతాయి. వాటిలో ప్రతి సభ్యుడు ఒక ప్రత్యేక పాత్ర పోషిస్తారు. కొన్ని మంచితో పాటు చెడు అనుభవాలు ఎదురవుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లోనే పార్టీలకతీతంగా అందరిలో పరస్పర గౌరవ భావం ఏర్పడుతుంది. తమ పదవీ కాలం ముగిసి సభను వీడుతున్న సభ్యులకు నేను ఒక్కటి చెప్పాలనుకుంటున్నా. రాజకీయాల్లో ఎప్పుడు ముగింపు ఉండదు. మీ అనుభవాలు, మీ సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది."

-నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

# రాజకీయాల్లో విరమణ.. అంటూ ఉండదు

2

రాజ్యసభలో ప్రధాని మోదీ

రాజకీయాల్లో విరమణ అంటూ ఏమి ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, పదవీవిరమణ చేసిన సభ్యులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సభ నుంచి వెళ్లేవారు కొత్తగా వచ్చేవారికి స్ఫూర్తిగా నిలుస్తారని

పదవీవిరమణ చేసిన ఎంపీలు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపు

దేవెగౌడ, పవార్ నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచన



## ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు

### స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

2

మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసుపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

ఈ కేసులో పుట్టా మహేశ్ సహా ఎనిమిది మందికి స్టేషన్ బెయిల్

స్టేషన్ బెయిల్ రావడంలో తన ప్రమేయం లేదన్న ముఖ్యమంత్రి

ఈ కేసు దర్యాప్తు కోసం సిట్ వేసినట్లు వెల్లడి

2028లో తెలంగాణల ఎన్నికలు రాబోవన్న ముఖ్యమంత్రి

2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని జోస్యం

## పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి

*నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు*



ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి సమావేశం

పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడత చెక్కు అందజేత

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం ఆలస్యమైందన్న ముఖ్యమంత్రి

2

హైదరాబాద్ పల్స్,అమరావతి

పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టులోని వివిధ ముంపు గ్రామాల నిర్వాసితులతో ఆయన సమావేశమయ్యారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును అందించారు. ఈ

# 1.5 లక్షల కోట్ల స్కామ్

మూసీ ప్రాజెక్టు రూ.1.5 లక్షల కోట్ల స్కామ్: కేటీఆర్

ప్రాజెక్టులో పారదర్శకత లేదంటూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ వాకౌట్

కేటీఆర్ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం.. తొలిదశకు రూ.7,000 కోట్ల అంచనా అని వెల్లడి

డీపీఆర్ లేకుండా వేల ఇళ్లను ఎలా కూల్చివేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రభుత్వం ఏకంగా రూ.1.5 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై శాసనసభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ వైఖరిలో

## 22న రైతు భరోసా నిధులు విడుదల

విడుదల చేయనున్నట్టు తెలిపిన తుమ్మల

రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తుమ్మల నాగేశ్వరరావు

22న రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్టు తెలిపిన తుమ్మల

70 లక్షల మంది ఖాతాల్లోకి నిధులు జమ అవుతాయని వెల్లడి

నేడు నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సీఎం ప్రారంభిస్తారన్న మంత్రి

2



# భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

మొదటి పేజీ తరువాయి

ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. మార్చి 14న పుజైరాలోని ఆయిల్ టెర్నినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. 'జగ్ లాడ్కి' అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది. ఇప్పటికే శివాలిక్, నందాదేవి నౌకలు హర్మూజ్ జలసంధిని గుండా ప్రయాణించి సురక్షితంగా భారత్ చేరుకున్నాయి. ఈ నౌకలు ఎల్పీజీ గ్యాస్‌ను తీసుకువచ్చాయి. సముద్రమార్గంలో జరిగే చమురు రవాణాలో ఐదవ వంతు హర్మూజ్ జలసంధి ద్వారా ఉంటుంది.

# ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు

## స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ కేసులో అరెస్టైన వారిలో ఎనిమిది మందికి నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రిగా తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశామని అన్నారు. ఏపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు నిబంధనల మేరకు స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. 2028లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు రాబోవని జోస్యం చెప్పారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందుగానే వస్తే సంతోషిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతకుముందు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఇతర నాయకులతో కలిసి ఆయన అధిష్ఠానం పెద్దలతో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు పరిచయం చేశారు.

# షేక్ హ్యాండ్ పరస్పరం పలకరింపు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా ఢిల్లీలో ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారు షేక్ హ్యాండ్ ఇచ్చుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. అదే సమయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసేందుకు రోజా పార్లమెంటు భవనానికి వచ్చారు. ఈ సందర్భంగా ఇరువురు తారసపడ్డారు. రోజాను పలకరించిన రేవంత్ రెడ్డి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రేవంత్ రెడ్డితో వెంట ఉన్న నాయకులు ఏదో ప్రశ్నించగా, తాను పని మీద వచ్చానని ఆమె సమాధానం చెప్పారు. ఆ తర్వాత రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని రోజా పలకరించారు.

# 99.93% మంది ఓటేశారట!

మొదటి పేజీ తరువాయి

చేపట్టారు. ఉత్తర కొరియాలో ఎన్నికల ప్రక్రియ ఎంత సులువో, ఎంత పారదర్శకమో ఈ ఫలితాలే చెబుతున్నాయి. బ్యాలెట్ పేపర్‌పై కేవలం అధికార పార్టీ అభ్యర్థి పేరు మాత్రమే ఉంటుంది. ఓటర్లు వచ్చి, ఆ పేరుకు మద్దతుగా ఓటు వేసి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడమే. ఒకవేళ ఎవరికైనా అభ్యర్థి నచ్చకపోతే, పేరును కొట్టివేసే 'విశాల హృదయం' కూడా ఎన్నికల సంఘం కల్పించింది. అయితే, అలా చేసిన వారిని దేశద్రోహులుగా పరిగణిస్తారు. వారి భవిష్యత్తు ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో, దేశ ప్రజలంతా తమ నాయకుడిపై ఉన్న అచంచలమైన విశ్వాసంతో దాదాపు 100% పోలింగ్‌లో పాల్గొన్నారు. అయితే, ఈ ఎన్నికల్లో అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం 0.07% వ్యతిరేక ఓట్లు. నియంత పాలనలో, ప్రాణాలకు తెగించి కిమ్‌ను వ్యతిరేకించిన ఆ ధైర్యశాలులు ఎవరనే దానిపై ఇప్పుడు అంతర్జాతీయంగా ఆసక్తికర చర్చ నడుస్తోంది. వారి క్షేమ సమాచారాలపై మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ ఎన్నికలు కేవలం ఓ బూటకమని, ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకున్నారని ప్రపంచ దేశాలు విమర్శిస్తున్నా.. తనకు ప్రజల నుంచి తిరుగులేని మద్దతు లభించిందని కిమ్ ఠీవిగా ప్రకటించుకున్నారు. ఈ చారిత్రాత్మక విజయంతో తన దేశంలోని 'ప్రత్యేకమైన ప్రజాస్వామ్యానికి' ఉన్న బలాన్ని ఆయన మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు.

# 1.5 లక్షల కోట్ల స్కామ్

మొదటి పేజీ తరువాయి

పారదర్శకత లేదని నిరసిస్తూ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ నది పునరుజ్జీవనానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భారీ దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైతే, దానిని ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. డీపీఆర్ లేకుండానే వేల ఇళ్ల కూల్చివేతకు, భూసేకరణకు ఎలా సిద్ధమవుతారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేటీఆర్ ఆరోపణలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుపై ఎలాంటి దాపరికం లేదని, కేటీఆర్ ఆరోపణలు నిరాధారమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించిన డీపీఆర్ పూర్తయిందని, దాని అంచనా వ్యయం రూ. 6,500 కోట్ల నుంచి రూ. 7,000 కోట్ల వరకు ఉంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వల్ల 1,435 నిర్మాణాలు ప్రభావితం అవుతాయని, తుది గణన జరుగుతోందని తెలిపారు. బఫర్ జోన్‌లో ఉన్న వారికి బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు (టీడీఆర్) ఇస్తామని, భూసేకరణ, పునరావాసం 2013 చట్టం ప్రకారమే జరుగుతుందని హామీ ఇచ్చారు. అయితే, ప్రభుత్వ వాదనను కేటీఆర్ తోసిపుచ్చారు. ముఖ్యమంత్రి బహిరంగ సభల్లో రూ. 1.5 లక్షల కోట్ల ప్రాజెక్టు అంటుంటే, సభలో మంత్రులు కేవలం రూ. 7,000 కోట్లు అని చెప్పడంలోనే వైరుధ్యం కనిపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం 10,000 ఇళ్లు కూల్చివేస్తారని, 3,260 ఎకరాల భూమిని సేకరించనున్నారని పేర్కొన్నారు. సింగపూర్, పాకిస్థాన్ వంటి దేశాల్లో నిషేధానికి గురైన 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి డీపీఆర్ బాధ్యతలు ఎలా అప్పగించారని ఆయన ప్రశ్నించారు. 18 నెలలు పట్టే డీపీఆర్‌ను రెండు నెలల్లోనే ఎలా పూర్తి చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, స్పష్టమైన ప్రణాళిక కూడా లేదని, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి ఎలాంటి రుణం మంజూరు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెందని ఆయన, పారదర్శకత పాటించడం లేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

## 22న రైతు భరోసా

# నిధులు విడుదల

మొదటి పేజీ తరువాయి

రైతులకు తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీపి కబురు అందించారు. ఈ నెల 22వ తేదీన సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ విడుదల చేయనున్నారని ఆయన వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమం ఆగకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకపోయినా, రైతుల ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రభుత్వం ఇవాళ్టి నుంచే కొనుగోళ్లను ప్రారంభించిందని తుమ్మల వెల్లడించారు. సిద్దిపేట జిల్లా నర్మెటలో నేడు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని చెప్పారు. ఈ సందర్భంగా నర్మెటలో మూడు రోజుల పాటు భారీ వ్యవసాయ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

# పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోలేదని, వరద నీటిలో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. రంపచోడవరం నియోజకవర్గం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రాజెక్టు నిర్వాసితులు రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ ఇళ్లను, భూములను త్యాగం చేశారని అన్నారు. ఈ ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వాసితుల ఖాతాల్లో రూ. 226 కోట్లు జమ చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఉగాది తర్వాత రెండు నెలల్లో పోలవరం సాకారమవుతుందని హామీ ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని ఆరోపించారు. నిపుణులతో అధ్యయనం చేయించి తిరిగి కొత్త నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. వారం రోజుల్లో ఇది పూర్తవుతుందని తెలిపారు. 21 నెలల్లో ప్రాజెక్టు పనులు వేగవంతం చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2025లో సంక్రాంతి పండుగ సందర్భంగా మొదటి విడతగా నిర్వాసితులకు రూ. 800 కోట్లు, దీపావళికి రెండో విడతగా రూ. 916 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. మూడో విడతతో కలిపి, 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ. 1943.53 కోట్లను చెల్లించామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టు రెండు దశలుగా నిర్మితమవుతోందని తెలిపారు. తొలిదశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నట్లు వెల్లడించారు. 75 నిర్వాసిత కాలనీలలో ఇప్పటికే 26 పూర్తయ్యాయని, మిగిలిన49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. వీటి నిర్మాణం ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి పూర్తవుతుందని అన్నారు. ప్రతి నిర్వాసితుడికి రూ. 3.5 లక్షల మేర ఇంటి నిర్మాణం కోసం ఇస్తున్నామని, ఇంటి స్థలం కోసం ఇచ్చే మొత్తాన్ని రూ. 2 లక్షలకు పెంచామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తోందని అన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. దళారులను నమ్మి మోసపోవద్దని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి పుష్కరాలు మూడోసారి నిర్వహించే గౌరవం తనకు దక్కిందని ముఖ్యమంత్రి అన్నారు. పుష్కరాల నిర్వహణ కంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని అన్నారు. అలాగే ఈ ప్రాజెక్టు ప్రారంభాని కంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో రూ. 5 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులంతా ప్రజల హృదయాల్లో నిలుస్తారని అన్నారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలమే పోలవరం ప్రాజెక్టు అన్నారు. అందరికీ న్యాయం చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం ప్రాజెక్టు ఆరేడేళ్లు ఆలస్యమైందని అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదు

మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. శాసన మండలిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, మంజూరు సమస్యలపై ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, మధుసూధనాచారి ప్రశ్నలు అడిగారు. టాటా ఏస్ లాంటి కిరాయి వాహనం నడుపుకుంటే ఫోర్ వీల్స్ వాహనం కింద లెక్కేసి ఇందిరమ్మ పథకానికి అనర్హుడని చెబుతున్నారని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్లు కట్టుకున్న ఇళ్లను అనుమతించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదని, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడాదికి 4 లక్షల 50 వేల చొప్పున నిర్మిస్తాం అని చెప్పిందని, మరి ఆ విధంగా ఆ హామీ అమలు కావడం లేదని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగా దానికి బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో అవకవతవకలు జరుగుతున్నాయని కలెక్టరేట్ల ముందు అర్హులు ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమాధానమిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదని, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రింట్ మీడియాను చదివేవారు, ఎలక్ట్రానిక్ మీడియాను చూసే వాళ్లు చాలా తగ్గిపోయారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా డిజిటల్ మీడియా వైపు వెళుతున్నారు అని అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా? అని ఆయన ప్రశ్నించారు. వచ్చే రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తీసుకు రానున్నామని పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులను వేరు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. నిజమైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నది తమ లక్ష్యం అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన వివాదాలు లేకుండా పాత్రికేయులకు ఇళ్ల స్థలాల పంపిణీకి యోచిస్తున్నట్లు చెప్పారు. వర్కింగ్ మరణించిన వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం లక్ష రూపాయలు అందిస్తుందని వివరించారు.

# రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. సభలో చర్చలు జరిగేటప్పుడు ఎన్నో రకాలు వాదనలు జరుగుతాయన్న మోదీ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే వాటి అంతిమ లక్ష్యమన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లిఖార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుల నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. వీరంతా తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలోనే గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు వీడ్కోలు తెలిపారు. సౌమ్యుడు, మృదుభాషి అయినా కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా ఆయనను ప్రశంసించారు. విరామ సమయాల్లో కూడా హరివంశ్ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, జాతీయ ప్రాముఖ్యం గల అంశాలపై యువతతో మమేకమయ్యారని గుర్తు చేశారు. పదవీ విరమణ చేస్తున్న కొందరు సభ్యులు పాత, కొత్త పార్లమెంట్ భవనాలు రెండింటిలోనూ పనిచేసిన అరుదైన ఘనతను సాధించారని మోదీ అన్నారు. జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఆరేళ్ల రాజ్యసభ పదవీకాలం అమూల్యమైన అవకాశమని చెప్పారు. మరోవైపు రాజ్యసభలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు, ప్రజా జీవితంలో ఉన్నవారు దేశానికి సేవ చేయాలనే తపనతో అలసిపోకుండా, పదవీ విరమణ చేయకుండా ఉంటారన్నారు. ఈ క్రమంలోనే మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడతో తనకు 54 ఏళ్లకు పైగా ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఉన్నవారు దేశానికి సేవ చేయాలనే తపనతో అలసిపోరు, విరమించుకోరు. నాకు దేవెగౌడ 54 ఏళ్ల ముందు నుంచి తెలుసు. నేను ఆయనతో చాలా కాలం పనిచేశాను. ఆ తర్వాత ఏమైందో నాకు తెలియదు. ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు." అంటూ చమత్కరించారు. కాగా, ఇటీవలె 10 రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాల భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికెషన్ ఇచ్చింది. ఇందులో 26 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మిగిలిన స్థానాలుకు పోలింగ్ నిర్వహించింది. ఇందులో బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ూవీ చీఫ్ ఉపేంద్ర కుష్వాహా సహా పలువురు గెలిచారు. అటు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆర్పీఐ (ఏ) అధినేత రాందాస్ అఠావలె, అన్నాడీఎంకే నాయకుడు తంబిదురై, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ, బీజేపీ సీనియర్ నాయకుడు వినోద్ తావ్డే, తృణమూల్ నేత బాబుల్ సుప్రియో తదితరులు ఉన్నారు.

# హింసకు గురి చేశారు

మొదటి పేజీ తరువాయి

సత్తెనపల్లి, నల్లపాడు, పట్టాభిపురం పోలీస్ స్టేషన్లలో తనపై నమోదైన అక్రమ కేసుల విషయంలో పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లతో తనను 18 రోజుల పాటు సెంట్రల్ జైల్లో ఉంచేలా పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఇది సుప్రీంకోర్టు గత తీర్పులకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేశ్ చెబితేనే తనను కోర్టులో ప్రవేశ పెట్టారని మండిపడ్డారు. తనను లాకప్‌లో ఉంచిన సమయంలో పోలీసులు శారీరక, మానసిక హింసకు గురిచేశారని, దీనిపై న్యాయపోరాటం చేస్తానని అంబటి అన్నారు. తన నివాసం, వాహనాల మీద ఏడు గంటల పాటు దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోకుండా ప్రేక్షక పాత్ర వహించారని, కానీ దాడి చేసిన వారికి మాత్రం వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది కేవలం పవన్ కల్యాణ్ కి మాత్రమే పరిమితమైందని... సామాన్య ప్రజలకు, ప్రతిపక్షాలకు ఇది 'ఆటవిక పాలన'గా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, పోలీసు వ్యవస్థను మేనేజ్ చేస్తే ఏమైనా చేయొచ్చనే అరాచక వాతావరణం నెలకొందని అంబటి దుయ్యబట్టారు. న్యాయవ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, ఎంతదూరమైనా వెళ్లి పోరాడతానని స్పష్టం చేశారు.

# షెడ్యూల్డ్ కులాల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : అడిషనల్ కలెక్టర్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, సంగారెడ్డి ప్రతినిధి :** షెడ్యూల్డ్ కులాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ పాండు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన యూనిట్లకు బ్యాంకులు వేగంగా రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళిక 202526 కింద సంగారెడ్డి జిల్లాకు మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లకు రుణాల మంజూరు పై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ పాండు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం కృష్ణతేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన వివిధ యూనిట్లకు బ్యాంకులు సమయానికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీతో ఈ పథకాలను అమలు చేస్తున్నందున బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారని, అనంతరం స్క్రీనింగ్ కమ్ సెలక్షన్ కమిటీ ద్వారా అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకులు త్వరితగతిన కాన్సెంట్ ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. అదేవిధంగా పథకాల అమలులో ఎటువంటి ఆలస్యం లేకుండా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని అన్నారు. జిల్లాలో షెడ్యూల్డ్ కులాల ఆర్థిక అభివృద్ధికి ఈ పథకాలు ఎంతో దోహదపడతాయని, అందరూ సమన్వయంతో పనిచేసి పథకాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణ సదుపాయాలతో లబ్ధిదారులు స్వయం ఉపాధి ఏర్పరుచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బ్యాంకులు సహకరించాలని కోరారు.

## యాదగిరిగుట్ట దేవస్థానంలో

# దళిత వర్గాల ఉద్యోగుల కు ప్రమోషన్ లు తక్షణమే ఇవ్వాలీ

**నూతన ఎండోమెంట్ డైరెక్టర్ ఎం.హనుమంతు రావు ని కలసిన దళిత సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా లోని యాదగిరిగుట్టలో నెలకొన్న ప్రాముఖ్యత గల దేవస్థానం అయిన శ్రీలక్ష్మీ నర్సింహ్మా స్వామి వారి దేవస్థానంలో గత కొన్ని నెలలుగా దళిత వర్గాల ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు ఇవ్వడం లేదని ఇతర సామాజిక వర్గాల కు సంబంధించిన ప్రమోషన్ల ఆర్డర్ లు మాత్రం ఇస్తున్నారని ఈ అంశం పై విచారణ జరిపి దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించాలని కోరుతు తెలంగాణ దేవాదాయ ధర్మాధాయ శాఖ డైరెక్టర్ ఎం.హనుమంతు రావు ని దళిత సంఘాల ప్రతినిధులు కలసి విజ్ఞప్తి చేయడం జరిగింది. యాదగిరిగుట్ట దేవస్థానంలో దళిత వర్గాల ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరెక్టర్ ఉన్నత అధికారిగా భాధ్యత లు స్వీకరించిన హనుమంతు రావు ని శాలువతో సన్మానించి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహ్మా స్వామి వారి ప్రసాదం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, దళిత ఐక్యవేదిక చైర్మన్ భట్టు రాంచంద్రయ్య మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, జర్నలిస్ట్ సంఘం నాయకులు వినియోగదారుల ఫోరమ్ నాయకులు ఎలిమినేటి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యభిచార గృహం పై దాడి.. నిర్వాహకుల అరెస్ట్



**‹ స్వర్ణపురి కాలనీలో ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం**


**‹ అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో సోదాలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, అమీన్‌పూర్ :** అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని హెచ్ఎంటీలో స్వర్ణపురి కాలనీలో ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకుని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. దీంతో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పింటూ అన్సారి ఇద్దరు యువతులతో వ్యభిచారం నిర్వహిస్తూ విటులతో పాటు పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అమీన్‌పూర్ పరిధిలో మరెన్నో వ్యభిచార గృహాలు..

అమీన్‌పూర్ బీరంగూడ డివిజన్ పరిధిలో అనేక మార్లు గతంలో వ్యభిచార గృహాల పై దాడులు చేసి పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ వ్యభిచార వ్యాపారాలు అనేక చోట్ల కొనసాగుతూనే ఉన్నాయని ఈ నోట ఆ నోట వినిపిస్తూనే ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో వందలాది కాలనీలతో పాటు అపార్ట్‌మెంట్లు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. అందుకు ఉమ్మడి రాష్ట్ర ప్రజలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఉపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చి స్థిరపడుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం పల్లె ప్రాంతంగా ఉన్న అమీన్‌పూర్, పట్టణ ప్రాంతంతో పాటు మహానగరంగా రూపుదిద్దుకుంది. కాగా రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భద్రతా చర్యలు లేకపోవడంతో అక్రమ వ్యాపారులకు అడ్డాగా మారుతోంది. ఇదే అదనుగా తీసుకుంటున్న కొందరు అక్రమార్కులు విచ్చలవిడితనంతో వ్యభిచార గృహాలు సైతం నిర్వహించడం పట్ల స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాలనీ నివాస ప్రాంతాల్లో అద్దెకు ఉంటున్నవారు ఎవరు, ఎలాంటి వాళ్లు, ఎక్కడి నుంచి వచ్చారో తెలియక ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కుటుంబాలతో గోప్యంగా నివసించాల్సిన చోట వ్యభిచార గృహాలను కొనసాగిస్తుండడం చూస్తుంటే తమ పిల్లల భవిష్యత్తుపై భయాందోళనలకు గురికావాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. అందుకు ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థను పటిష్టపరచి, గోప్య నిఘాతో అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# కొలనుపాక కోమట్ల మఠాన్ని పూర్వవైభవం తీసుకురావాలన్న మురళీకృష్ణ దంపతులు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని కోమట్ల మఠాన్ని పూర్వవైభవం తీసుకురావడానికి జ్యోతిష్య వాస్తు సంఖ్య శాస్త్ర సిద్ధాంతి మహా గౌరీ ఉపాసకులు దింటకుర్తి మురళీకృష్ణ దంపతులు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఐ.వి.ఎఫ్. యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రొద్దుటూరి రమేష్ గుప్తా అన్నారు. బజ్జూరి రవీందర్ గుప్తా, నాగబండి మధుసూదన్ గుప్తా, దింటకుర్తి మూరళీకృష్ణ గుప్తా లను ఘనంగా సన్మానించారు. మురళీకృష్ణ సిద్ధాంతి మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి రెండు తేదీల్లో చైత్ర పౌర్ణమి సందర్భంగా ఆర్యవైశ్య మఠంలో నగేశ్వర స్వామి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం, నిత్యం ధూప దీప నైవేద్యం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన మీడియాకు తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇన్చార్జ్ బజ్జూరి రవీందర్ గుప్తా మాట్లాడుతూ జిల్లా వైశ్యులు, రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు ఆర్థిక సహాయ సహకారాలు అందించి స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన అన్నారు. ఆలేరు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు నాగబండి మధుసూదన్ గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్య మఠాన్ని పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దిడిగం వీరయ్య, దిడిగం అంజయ్య, కాశెట్టి శ్రవణ్, కస్తూరి ఆంజనేయులు, నంగునూరి కృష్ణమూర్తి, మిరియాల ఉమేష్, పూర్ణచందర్, కస్తూరి వెంకటేష్, ఆంజనేయులు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు

# కెహెచ్ఆర్ ఫౌండేషన్ చలివేంద్రంను ప్రారంభించిన మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** ఆత్మకూరు (ఎం) చలివేంద్రంను ప్రారంభించిన మాజీ ప్రభుత్వ విప్, మాజీ శాసన సభ్యులు శ్రీమతి గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మరియు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చలివేంద్రం నిర్వాహకులు కెహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొప్పుల హరిదీప్ రెడ్డి, ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... వేసవి కాలంలో వడ దెబ్బకు ఎంతో మంది అనారోగ్యం చెందుతారని సమయానికి నీరు త్రాగాలని లేదంటే ఆరోగ్య సమస్యలు ఎదురు అవుతాయని సూచించారు బాట సారులకు దాహార్తి తీర్చడం గొప్ప విషయం అని, ఆత్మకూరు మండల ప్రజలకు కెహెచ్ఆర్ చలివేంద్రం తో పాటు ఎంతో మందికి తమ వంతు సేవలను అందించడం అభినందనీయం అని ప్రశంసించారు. ప్రజలలొ ఉంటూ ప్రజా సేవ చేయడం నా అదృష్టం అని, ప్రజా ఆశీస్సులు ఉన్నంత వరకు మేము మా కెహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్ముందు ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, జిల్లా నాయకులు భాష బోయిన ఉప్పలయ్య, కోరే బిక్షపతి, లగల రమేష్, సోలిపురం అరుణ, కాల మల్లేష్, కోల సత్తయ్య, పల్లెర్ల సత్యనారాయణ, కొండపల్లి అబ్బ సాయిలు, యాస అంజిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, గట్టు శంకర్, బూడిది వెంకన్న, లోడి మధు, లోడీ పరుశరాములు, శివ మల్లేష్, లోడి శంకర్, గజ్జెల్లి మహేష్, ఎలిమినేటి మచ్చగిరి, కొమ్మరాజుల ఉదయ్, పంజాల సాయి, మరాఠీ దుర్గా రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆటలా ధ్యారా పిల్లల అభివృద్ధి అనే అంశం పై ప్రసంగించిన సత్య టీచర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, నారాయణఖేడ్ :** మానూరు మండలంలోని తిమ్మాపూర్ అంగన్వాడి టీచర్ సత్య, అజిమ్ ప్రేమ్ జి ఫౌండేషన్ వారు నిర్వహించిన సెమినార్‌లో పాల్గొని, "ఆటల ద్వారా పిల్లల అభివృద్ధి" అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల సమగ్ర అభివృద్ధిలో ఆటల ప్రాముఖ్యతను వివరించారు. ప్రత్యేకంగా బయట ఆటలు పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అలాగే మొబైల్, టీవీ వినియోగాన్ని పరిమితం చేసి, పిల్లలను ఆటల వైపు ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పిడి లలిత కుమారి అధికారులు, సీడీపీవోలు సుజాత నారాయణఖేడ్ సూపర్వైజర్లు ప్రమీల జమున ప్రశాంతి మంజుల రెడ్డి సుజాత రాథోడ్ దేవకృప అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగానికి మంచి ప్రశంసలు లభించాయి.

# గ్రామంలోని సమస్యలపై కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఎరుకల వెంకటేష్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి విచ్చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ పాలక వర్గ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసిన తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ & మాజీ సర్పంచ్ ల ఫోరం ప్రెసిడెంట్, కామ్రేడ్ ఎరుకల కుమార స్వామి గౌడ్ ఫౌండేషన్ చైర్మెన్ ఎరుకల వెంకటేష్ గౌడ్ ఈ విషయం పై కలెక్టర్ అనురాగ్ జయంతి సానుకులంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నవోదయలో 4వ రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన అయాన్ వేదిక్

**క్రమశిక్షణతో కూడిన విద్య అయాన్ వేదిక్ జీవితాన్ని మార్చేసింది**

**తల్లిదండ్రుల కష్టం, అయాన్ వేదిక్ పట్టుదల ప్రగతి స్కూల్ విద్య బోధన**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపహాడ్ మండలం సోంపల్లి ( గంౖడగొడ్లపల్లి ) గ్రామానికి చెందిన బర్ల రామకృష్ణ,విజయలక్ష్మి దంపతుల కుమారుడు అయాన్ వేదిక్ ప్రగతి స్కూల్ సారపాక నందు 5వతరగతి విద్యనభ్యసిస్తూ, 2026, 6వతరగతి ఎంట్రెన్స్ పరీక్ష నవోదయాలో 4వ ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. అయాన్ వేదిక్ తల్లిదండ్రులు విద్యావంతులు కావడం, ప్రగతి స్కూల్ విద్య బోధన అయాన్ వేదిక్ కు వేదిక అయింది. చిన్ననాటి నుండి చదువుపై మక్కువ ఏదో సాధించాలన్న కసి పట్టుదల అయాన్ జీవితాన్నే మార్చేసింది. (92.50/100) ఉత్తీర్ణత సాధించాలంటే ఎంతో కఠోరమైన శ్రమ, పట్టుదల ఉంటే తప్ప ఈ ఉత్తీర్ణత సాధ్యం కాదు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అయాన్ పట్టుదల, ఉపాధ్యాయులకృషి నవోదయ ర్యాంక్ సాధించడంలో అయాన్ కు తోడ్పడింది. ఈ సందర్భంగా ప్రగతి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చైతన్య మాట్లాడుతూ పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చు, టాలెంట్ ఎవరి సొత్తు కాదని వత్తిడితో కాకుండా ఆసక్తితో చదివితే ఏ విద్యార్థి అయినా తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలడని సూచించారు. అయాన్ వేదిక్ ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఒక ప్రణాళికతో వారి ఆశయాలను బంగారు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

## హైవే పై పసికందు మృతదేహంతో... స్థానికంగా కలకలం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలోని హైవే పై ఓ మగ పసి కందు మృతదేహం లభ్యమైన అమానుష ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల సమీపంలో జాతీయ రహదారి పక్కన పడి ఉన్న పసి కందు మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆ పసికందును అక్కడ ఎవరైనా కావాలనే వదిలేశారా..? లేదా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు.

### ఆలేరు మండల ప్రజా పరిషత్
## కార్యాలయం ను అకాస్మిక తనిఖీ
### చెసిన సీఈవో శోభరాణి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** ఆలేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సీఈవో శ్రీమతి శోభరాణి సందర్శించి మండల అధికారులు మరియు ఈజీఎస్ సిబ్బందితో సమావేశమై కార్యాలయ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి చెందినారు. మరియు ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమై పనుల పర్యవేక్షణ, జరిగే పనులు యొక్క సమీక్ష చేయడం జరిగింది. తదనంతరం సి.ఇ.ఓ కొలనుపాక గ్రామం క్షేత్ర సందర్శించి గ్రామ నర్సరీ, కమ్యూనిటీ సానిటరీ టాయిలెట్ నిర్మాణం పనిని మరియు సీసీ రోడ్ నిర్మాణం జరుగు పనిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, సూపర్డెంట్ హరిత దేవి మేడం, ఏపీఓ అరుణ కుమారి, ఈ.సి వై.రామచంద్రయ్యా చారి, టి.ఏ మానస, సిఓ సరళ మరియు కార్యాలయ సిబ్బంది హాజరైనారు. కొలనుపాక గ్రామ సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శి గ్రామ సందర్శనలో పాల్గొన్నారు

# ఐటీసీ ఉద్యోగి తోకల రమేష్ కు “స్వర్ణ నంది ఉగాది పురస్కారం“

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన తోకల రమేష్ మరో అవార్డు, స్వర్ణనంది ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు.మొగిలి అండ్ ఎన్.ఎస్. ఎంటర్టైన్ మెంట్స్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక “స్వర్ణనంది “ఉగాది పురస్కారానికి గాను వివిధ రంగాలలో సేవలందించిన ప్రముఖులను ఎంపిక చేసినట్లు నిర్వహకులు మొగిలి గుణకర్, నాగసాయిలు తెలియజేస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఒక కవి, రచయిత, గాయకుడుగా మాత్రమే కాకుండా, ప్రాచీన జానపద కళ అయిన కోలాటంలో ప్రముఖ మాస్టారుగా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ వాటిని కొత్త తరాలకు పరిచయం చేయడంలో చేస్తున్న ప్రశంసనీయమైన సేవలు, ప్రత్యేకంగా మహిళల సాధికారత కోసం ఉచితంగా కోలాటం శిక్షణ ఇచ్చి వారి ప్రతిభను వెలికితీసి, వేదికలపై ప్రదర్శించే అవకాశాలను కల్పించిన విధానం, సమాజిక, కళా,సాహిత్య రంగాలలో వారు చేస్తున్న విస్తృత సేవలకు గాను ఉగాది బంగారు నంది పురస్కారం-2026 కు జాతీయ సేవారత్న అవార్డు గ్రహీత,మాస్టర్ తోకల రమేష్ ను ఎంపిక చేసినట్లు, ఈ నెల 22న ఆదివారం ఎన్ ఎస్ పి క్యాంపు లోని రామగిరి పంక్షన్ హాల్ ఖమ్మం నందు ప్రముఖుల చేతుల మీదుగా అందజేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవార్డుకు తోకల రమేష్ ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, తోటి ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవార్డు రావడం పట్ల తోకల రమేష్ మాట్లాడుతూ ఈ పురస్కారం నాపై మరింత బాధ్యత పెంచిందని, ఎంపిక చేసిన కమిటీ వారికి, నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు




# భద్రాద్రిలో గోదావరి పుష్కరాలకు 9 ఘాట్ల ఏర్పాటు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం పెద్ద ఎత్తుతో సిద్ధాలు చేస్తోంది. ఈ పవిత్రోత్సవానికి 9 ఘాట్ల నిర్మాణానికి రూ.376 కోట్ల బడ్జెట్ కేటాయించారు. భక్తులు సౌకర్యంగా స్నానాలు చేసుకోవడానికి ఈ ఘాట్లు ముఖ్యమైనవి. భద్రాచలం, మోతేగడ్డ, బూర్గంపహాడ్, మణుగూరు, పినపాక, అశ్వాపురం వంటి ప్రధాన తీర ప్రాంతాల్లో ఈ ఘాట్లు ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా మోతేగడ్డలో ప్రత్యేక విఐపి ఘాట్ నిర్మిస్తూ ఎగువతరాలకు అదనపు సౌలభ్యాలు కల్పిస్తారు. ఈ పుష్కరాలు గోదావరి నది తీరంలో 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే పవిత్ర కార్యక్రమం. లక్షలాది భక్తులు ఇక్కడికి వచ్చి పుణ్య స్నానాలు చేస్తారు. ప్రభుత్వం ఈసారి మొత్తం ఘాట్ల నిర్మాణంతో పాటు రహదారులు, తాగునీరు సరఫరా, మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తోంది. రహదారుల విస్తరణతో భక్తుల రవాణా సులభతరం అవుతుంది. ప్రతి ఘాట్ వద్ద తాగునీరు అందేలా పైపులైన్లు, ఫిల్టర్లు ఏర్పాటు చేస్తారు. ఇతర మౌలిక సదుపాయాల్లో శౌచాలయాలు, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు కూడా ఉంటాయి. భద్రాచలం రామాలయం చుట్టూ ఉండే ఘాట్లు ప్రధాన ఆకర్షణ. ఇక్కడ భక్తులు శ్రీరామ చరిత్రలో భాగంగా పుష్కర స్నానాలు చేస్తారు. మోతేగడ్డలో విఐపి ఘాట్‌తో పాటు ప్రత్యేక రక్షణ, సౌకర్యాలు ఏర్పాటు చేయడం విశేషం. బూర్గంపహాడ్, మణుగూరు ప్రాంతాల్లో కూడా నది తీరంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పినపాక, అశ్వాపురం వంటి చోట్ల ఘాట్లు మరింత ఆధునికంగా ఉండేలా రూపొందిస్తారు. ఈ ఘాట్లలో స్లిప్ రోడ్లు, రైలింగ్లు, లైటింగ్ సౌకర్యాలు సమగ్రంగా ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును త్వరగతిలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027 పుష్కరాలకు ముందు అన్ని సౌకర్యాలు సిద్ధం కావాలి. జిల్లా అధికారులు, ఇంజనీర్లు కలిసి పనులు ప్రారంభించనున్నారు. ఈ కేటాయింపు భద్రాద్రి జిల్లా అభివృద్ధికి మరో మైలురాయి, స్థానికులు, భక్తులు ఈ అవకాశంతో ఆనందిస్తున్నారు. పుష్కరాలు జరగడానికి ఇంకా ఏడాది కాలం ఉంది కానీ కార్యచరణ ప్రణాళికలు వేగవంతంగా సాగుతున్నాయి.

**376 కోట్లు కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం**

**మోతేగడ్డలో ప్రత్యేక విఐపి ఘాట్,మౌలిక సదుపాయాలపై సమీక్ష**

**పుష్కరాలకు బడ్జెట్ కేటాయింపు ఘాట్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి**

# తుర్కపల్లి ఆధ్యాత్మిక ధ్రువతార ‘మేర అంజయ్య‘ అస్తమయం...

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :**
ఆధ్యాత్మికతకు అభినయం తోడైతే ఎలా ఉంటుందో.. నిరాడంబరతకు నిలువెత్తు రూపం ఎలా ఉంటుందో చెప్పడానికి నిదర్శనం ‘మేర అంజయ్య‘ (ఆదిమూలం అంజయ్య) తుర్కపల్లి మండల కేంద్రం ఒక గొప్ప కళాకారుడిని, అంతకన్నా గొప్ప మనిషిని కోల్పోయి నేడు మూగబోయింది. ఆయన మరణం కేవలం ఒక కుటుంబానికే కాదు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జానపద, ఆధ్యాత్మిక కళారంగానికి తీరని లోటు. మృదు స్వభావమే ఆయన ఆభరణం

అంజయ్య అంటేనే ఒక ఆప్యాయత. గ్రామంలో ఎవరిని చూసినా ఆపి పలకరించడం, యోగక్షేమాలు అడగడం ఆయన నైజం. ఎవరి ఇంట్లో ఆపద ఉన్నా పలకరించి ధైర్యం చెప్పడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. ఈ మృదు స్వభావమే ఆయనను అందరివాడిగా మార్చింది.

ఆధ్యాత్మిక చైతన్యం.. భజన కోకిల గ్రామంలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడంలో అంజయ్య గారి పాత్ర చిరస్మరణీయం.

**వినాయక నవరాత్రులు:**
గ్రామంలో తొలిసారిగా వినాయక మండపాన్ని ఏర్పాటు చేసి, ఆ ఉత్సవాలకు ఒక క్రమశిక్షణను, భక్తిని జోడించిన వ్యక్తుల్లో ఆయన ప్రథములు.

ఆ కంచు కంఠం ఇక వినబడదు: సాయంత్రం ఏడైందంటే చాలు.. “భక్తులంతా మండపం దగ్గరికి రావాలి“ అంటూ మైకులో వినిపించే ఆయన కంచు కంఠం తుర్కపల్లి వాసులకు ఒక మేల్కొలుపు.


**భజన రూపశిల్పి:**
పాండురంగ భజనలు పాడుతూ, ఆ పాటలకు అనుగుణంగా అడుగులు ఎలా వేయాలో ఆయన నేర్పించే తీరు అద్భుతం. ఆయన గొంతెత్తి పాడుతుంటే గ్రామస్తులు మైమర్చి అర్ధరాత్రి వరకు భజనల్లో మునిగితేలేవారు.

**రాముని సేవలో.. అభినయ తపస్విగా..**
శ్రీరామనవమి వచ్చిందంటే అంజయ్య గారి భక్తి మరో రూపం దాల్చేది. స్వామివారి ఉత్సవ మూర్తులకు తన చేతులతో స్వయంగా పట్టు వస్త్రాలు కుట్టి అలంకరించేవారు. కల్యాణం నాడు కీర్తనలు పాడుతూ, వేదికలను సిద్ధం చేస్తూ అలుపెరగని సేవ చేసేవారు.

**బహుముఖ ప్రజ్ఞ:**
భాగవత ప్రదర్శనల్లో ఆయన వేసిన రాముడు, రావణాసురుడు, మల్లన్న వేషాలు ప్రేక్షకుల హృదయాల్లో ముద్ర వేసుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో గ్రామాల్లో ప్రదర్శనలు ఇచ్చి, ఉత్తమ కళాకారుడిగా ఎంతో మంది మెప్పు పొందారు.

**ఉమ్మడి కుటుంబానికి ఆదర్శం**
నేటి కాలంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న తరుణంలో, ఎన్నో ఏళ్లుగా తన కుటుంబాన్ని ఏకతాటిపై నడిపిస్తూ, ప్రేమానురాగాలను పంచుతూ ఆయన ఆదర్శంగా నిలిచారు. వివాదరహితుడిగా, నీతినిజాయితీలకు కట్టుబడిన వ్యక్తిగా ఆయన జీవితం

**నేటి తరానికి స్ఫూర్తిదాయకం:**
విధి ఆ మనసున్న మనిషిని మన నుండి దూరం చేసింది. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన కీర్తనలు, ఆయన వేసిన వేషధారణలు తుర్కపల్లి గాలిలో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఆ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, సీతారామచంద్రస్వామి ఆయన కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ.. మీ పాదాలకు నమస్కరిస్తూ...



**రమణాకర్ పత్తిపాటి**

### పార్లమెంట్ లో అగ్రికల్చర్ డిమాండ్
# ఫర్ గ్రాంట్స్ చర్చలో మాట్లాడిన చామల కిరణ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి : చామల** కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి లోక్ సభ సభ్యులు సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత లోక్ సభలో మాట్లాడిన చామల కిరణ్ కుమార్ రెడ్డి అగ్రికల్చర్ డిమాండ్ ఫర్ గ్రాంట్స్ చర్చలో చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడిన అంశాలు.... భారతదేశంలో సగం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు కానీ అది జీడీపీ కి కేవలం 16% నుండి 18% మాత్రమే అందిస్తోంది. ఇది నిర్మాణాత్మక అసమతుల్యతకు నిదర్శనం రైతులకు 202627 బడ్జెట్ అనుకూలంగా లేదు,కేంద్ర బడ్జెట్ రైతులకు ఉపయోగపడదు కార్పొరేట్‌లకు దాదాపు 16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారు. కానీ రైతుల రుణాలు మాఫీ చేయలేదు దేశంలో ఉన్న రైతులు చేసిన తప్పు ఏంటి రైతులకు అడిగే గొంతు లేదని కేంద్రం భావిస్తుందా? స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు విఫలమైంది. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు రైతుల చట్టపరమైన



హామీని కేంద్రం ఎందుకు పరిష్కరించలేకపోతుంది రైతులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఎందుకు వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటుంది. ప్రతిపాదిత విత్తనాల బిల్లు 2025లో తెలంగాణ రాష్ట్రం ప్రతిపాదించిన సవరణలు, పంట నష్టానికి పరిహారం, విత్తనోత్పత్తికి కేంద్రం సహకరించాలి ఆయిల్ పామ్ రైతులకు శాస్త్రీయ మద్దతు అందించడానికి తెలంగాణలో ఆయిల్ పామ్ ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది ప్రామాణిక విత్తన మొలకల కోసం సుస్థిరమైన చర్యలు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలి.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 ప్రకారం తెలంగాణలో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలి.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుండి మద్దతు అవసరం. బడ్జెట్‌ను సవరించాలి.ప్రభుత్వం రైతు అనుకూల వైఖరిని అవలంభించాలి. దేశంలో 60% జనాభా రైతులపై ఆధారపడి ఉంది.మరియు దాదాపు 50% ఉపాధి వ్యవసాయ రంగం ద్వారానే కల్పించబడుతోంది అని లోక్ సభలో అనేక విషయాలు ప్రస్తావించారు.

## అసెంబ్లీ లో సామాన్య ప్రజల ఇళ్ల, స్థలాల

# హక్కులను కల్పించాలనీ కోరిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య


**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22(ఎ) వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య 8వ అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతూ బిఆరెస్, బీజేపీ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధిత కుటుంబాలను భయాందోళనకు గురి చేస్తున్నారాని, ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధికోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాలుగా కేటాయించి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దానితోపాటు ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇస్తుందని గుర్తు చేశారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలకు అన్యాయం జరగనీయబోమని వారి ఇళ్ల, స్థలాల హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అందుకుగాను సంబంధిత మంత్రివర్యులు ఆయా శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ వేదికగా పేదల ఇళ్ల పట్టాల సమస్యను ప్రస్తావిస్తూ ఆ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించి క్రాయ విక్రయాలకు అర్హత కల్పించి బాధితులకు ఊరట కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. భూములను, ఇండ్ల స్థలాలను సెక్షన్ 22 ఎ (ప్రభుత్వ భూములు లేదా వివాదాస్పద భూములు) కింద చేర్చడం వల్ల వేల సంఖ్యలో పేద, మధ్యతరగతి ప్రజలు తమ సొంత స్థలాలను అమ్ముకోలేక, కనీసం బ్యాంకు రుణాలు కూడా పొందలేక ఇబ్బంది పడుతున్నారని. ముఖ్యంగా ఆలేరు నియోజకవర్గంతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా అనేక గ్రామాల్లో దశాబ్దాల కాలంగా నివసిస్తున్న ఇండ్ల స్థలాలు కూడా ఈ జాబితాలో ఉండటంపై బాధితులు ఆవేదనతో ఉన్నారని కావున. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అర్హులైన పేదలకు చెందిన ఇండ్లను, ప్లాట్లను వెంటనే ఈ నిషేధిత జాబితా నుండి తొలగించాలని ఆయన కోరారు.



# రంజాన్ ఎప్పుడంటే ? సౌదీ అరేబియా ప్రకటన..! భారత్ లో..!

హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, నేషనల్ డెస్క్: రంజాన్ మాసం ముగింపు దశకు చేరింది. దీంతో రంజాన్ పండుగ కోసం ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఎదురుచూస్తున్నారు. భారత్ లో ఇవాళ్టికి రంజాన్ మాసం ప్రారంభమై 28 రోజులు ముగిశాయి. గల్ఫ్ దేశాల్లో రంజాన్ మాసం ప్రారంభమై 29 రోజులయ్యాయి. దీంతో గల్ఫ్ దేశాల్లో ఇవాళ్టి నుంచే నెలవంక దర్శనం కోసం చూపులు మొదలుపెట్టారు. సౌదీ అరేబియా సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇవాళ సాయంత్రం తర్వాత రంజాన్ తర్వాత మాసం షవ్వాల్ నెలవంక కోసం జనం ఎదురుచూశారు. కానీ వారికి నిరాశే ఎదురైంది.

**రంజాన్ కానుక: పండుగ వేళ భారీగా నిధుల విడుదల:** దీంతో ఈద్ అల్-ఫితర్ (రంజాన్) పండుగను మార్చి 20న జరుపుకుంటామని సౌదీ అరేబియా అధికారికంగా ప్రకటించింది. గల్ఫ్ న్యూస్ ప్రకారం రంజాన్ ఉపవాసాలు పూర్తవుతున్నా.. షవ్వాల్ నెలవంక కనిపించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన రిపోర్ట్స్ ను సమీక్షించడానికి సమావేశమైన నెలవంక దర్శన కమిటీ, కొత్త నెలలోకి ప్రవేశాన్ని ధృవీకరించింది. మతపరమైన సంప్రదాయాలకు అనుగుణంగా చంద్ర దర్శనం ఆధారంగా నెలల ప్రారంభాన్ని నిర్ణయించే సుదీర్ఘకాల ఇస్లామిక్ పద్ధతిని ఇది అనుసరిస్తుంది.




**రంజాన్ స్పెషల్ సూప్.. ఇలా ఈజీగా చేసుకోండి..!**

ఇవాళ అమావాస్య కావడంతో పలు దేశాల్లో నెలవంక కనిపించలేదు. దీంతో రేపు కూడా గల్ఫ్ దేశాల్లో రంజాన్ నెల ఉపవాసాలు కొనసాగబోతున్నాయి. అనంతరం ఎల్లుండి (శుక్రవారం) పండుగ జరుపుకోవాలని సౌదీ అరేబియా నిర్ణయించింది. ఈ లెక్కన ఒక రోజు ఆలస్యంగా అంటే శనివారం భారత్ లో రంజాన్ పండుగ చేసుకోబోతున్నారు. ఈ మేరకు రేపు, ఎల్లుండి కూడా భారత్ లో ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు కొనసాగించబోతున్నారు. మరోవైపు టర్కీ కూడా ఎల్లుండి 20వ తేదీన పండుగ జరుపుకోవాలని నిర్ణయించగా.. సింగపూర్ 21న పండుగ చేసుకుంటామని ప్రకటించింది.




# తీవ్ర సంక్షోభంలో పాకిస్తాన్- ప్రధాని షరీఫ్ అనూహ్య ఆదేశాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18 :** పొరుగుదేశం పాకిస్తాన్.. నానాటికీ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. ఇరాన్ యుద్ధం ఆరంభమైన తర్వాత ఆ దేశ పరిస్థితి మరింత దిగజారింది. అదే సమయంలో ఆఫ్ఘనిస్తాన్ పై సైనిక చర్యలకు దిగాల్సి రావడం.. మూలిగే నక్క మీద తాటికాయ పడిన చందంగా తయారైంది. మిత్రదేశం చైనా గానీ, అమెరికా గానీ గతంలో ప్రకటించిన ఫైనాన్షియల్ ప్యాకేజీలు ఇంతవరకూ విడుదల కాకపోవడం అదనపు భారంగా పరిణమించింది.ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. దేశంలో నెలకొన్న చమురు సంక్షోభం, తీవ్రతరమౌతోన్న ఆర్థిక దుస్థితి నేపథ్యంలో పొదుపు చర్యలకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పాకిస్తాన్ దినోత్సవ వేడుకలను రద్దు చేశారు. ఈ నెల 23న జరగాల్సిన పాకిస్తాన్ డే పరేడ్, అనుబంధ లాంఛనప్రాయ కార్యక్రమాలు నిర్వహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రాల రాజధానుల స్థాయిలో ఈ వేడుకలను నామమాత్రంగా జరుపుకోవాలని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి మాత్రమే పరిమితం చేయాలని సూచించారు.

**"పాకిస్తాన్ ఘాతుకంపై రషీద్ ఖాన్ షాక్":**

ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. గల్ఫ్ చమురు సంక్షోభం, ప్రభుత్వం ప్రకటించిన పొదుపు చర్యల నేపథ్యంలో 23న జరగాల్సిన పాకిస్తాన్ దినోత్సవ పరేడ్, అనుబంధ కార్యక్రమాలు రద్దయినట్లు పీఎంఓ స్పష్టం చేసింది. విస్తృత పొదుపు విధానాలకు అనుగుణంగా ఈ నిర్ణయాన్ని తీసుకోవాల్సి వచ్చిందని తెలిపింది. ఆ రోజున పరిమిత స్థాయిలో ఎటువంటి ఆర్భాటాలు లేకుండా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించింది.ప్రతి సంవత్సరం మార్చి 23న సైనిక పరేడ్‌తో పాకిస్తాన్ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ముస్లింల కోసం స్వతంత్ర దేశాన్ని కోరుతూ 1940లో రూపొందించిన లాహోర్ తీర్మానాన్ని స్మరించుకోవడానికి ఈ వేడుకలు నిర్వహిస్తుంటుంది పాకిస్తాన్. కిందటేడాది వరకూ క్రమం తప్పకుండా ఈ సెలబ్రేషన్స్ జరిగాయి. ఈ సారి ఆర్థిక సంక్షోభ పరిస్థితులు అడ్డు పడ్డాయి. పశ్చిమ ఆసియా, గల్ఫ్ యుద్ధ ప్రభావం పాకిస్తాన్ ఖజానాపై పడుతోంది.చమురు సంక్షోభంతో ఎదురవుతున్న తీవ్ర ఆర్థిక ఒత్తిడిని అధిగమించేందుకు దేశం ఇటీవల పలు కఠిన చర్యలు తీసుకుంటోంది. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ షరీఫ్ ప్రజల రక్షణ, వనరుల నిర్వహణకు ఉద్దేశించిన పలు పొదుపు చర్యలను ప్రకటించారు. ఇందులో ప్రావిన్షియల్ మంత్రులకు ఇంధన సరఫరా నిలిపివేత, ప్రభుత్వ వాహనాలకు పెట్రోల్, డీజిల్ భత్యాలలో 50 శాతం తగ్గింపు వంటివి ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు కూడా వర్క్ ఫ్రమ్ హోమ్ వెసలుబాటు ఇచ్చారు.



# దేశంలో ఎల్పీజీ కొరత లేదు.. 40 శాతం దేశీయ ఉత్పత్తి పెరిగింది: కేంద్ర ప్రభుత్వం స్పష్టత

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18:** అమెరికా, ఇజ్రాయెల్ / ఇరాన్ యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్ పై తీవ్ర ప్రభావం పడింది. దీంతో సరఫరాపై నెలకొన్న ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా దేశీయ రిఫైనరీల్లో ఎల్పీజీ ఉత్పత్తిని 40 శాతం మేర పెంచామని, దేశవ్యాప్తంగా ఎక్కడా గ్యాస్ స్టాక్ నిలిచిపోయిన పరిస్థితి లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ బుధవారం నాడు మధ్యాహ్నం స్పష్టం చేశారు. అలాగే హర్మూజ్ జలసంధి వద్ద ఉన్న 22 భారతీయ ట్యాంకర్లు సురక్షితంగా ఉన్నాయని, ఇప్పటికే 'నందాదేవి', 'శివాలిక్' నౌకలు గుజరాత్ తీరానికి చేరుకుని అన్-లోడింగ్ ప్రక్రియను ప్రారంభించాయని ఆమె తెలిపారు.ప్రజలు సోషల్ మీడియా పుకార్లను నమ్మి పానిక్ బుకింగ్స్ చేయవద్దని, ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే సిలిండర్లు నేరుగా ఇంటికే అందుతాయని భరోసా ఇచ్చారు .వ్యాపార అవసరాల కోసం ఇప్పటికే 15 రాష్ట్రాలు కమర్షియల్ సిలిండర్ల కేటాయింపును ప్రారంభించాయని, గత నాలుగు రోజుల్లోనే దేశవ్యాప్తంగా 7,200 టన్నుల కమర్షియల్ ఎల్పీజీని పంపిణీ చేసినట్లు సుజాత శర్మ వివరించారు. భారత్ దాదాపు 40 దేశాల నుండి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నందున ఎటువంటి కొరత ఉండదని, మన రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.అలాగే గృహ వినియోగదారులు సాధ్యమైనంత వరకు ఎల్పీజీ నుండి పైపుడ్ నేచురల్ గ్యాస్ కి మారాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. దీనివల్ల ఎల్పీజీపై ఒత్తిడి తగ్గుతుందని, ఇప్పటికే దేశంలోని 60 లక్షల కుటుంబాలు పీఎన్‌జీకి మారే అవకాశం ఉందని అధికారులు గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. ఎల్పీజీ బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ బుధవారం నాడు ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించింది.



# అక్రమంగా లేగ దూడలను తరలిస్తున్న వాహనాల పట్టివేత





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, నర్సాపూర్ :** అక్రమంగా ఆవులను, దూడలను తరలిస్తున్న మూడు వాహనాలను పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన నర్సాపూర్లో చోటు చేసుకుంది. బుధవారం ఉదయం తూప్రాన్ వైపు నుంచి సంగారెడ్డి వైపు మూడు లారీలలో అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానిక హిందు వాహిని, బిజెపి ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ తదితర హిందూ సంఘ నాయకులు స్థానిక చౌరస్తా వద్ద వాహనాలను అడ్డుకొని తనిఖీ చేయడంతో ఆవులు లేగ దూడలు ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వాహనాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోకి తరలించి అక్కడ విచారణ చేపట్టారు. అనంతరం బీరంగూడ గోశాలకు తరలించినట్లు తెలిసింది. అయితే మూడు వాహనాలలో సుమారు 100కు పైగా గోవులు, ఆవులు ఉన్నట్లు హిందూ సంఘ నాయకులు తెలిపారు. వాహనాలలో ఒకదానిపై ఒకటి కిక్కిరిసి ఆవులను దూడలను వేయడంతో వాటికి ఊపిరాడక అందులో కొన్ని అప్పటికే చనిపోయి ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న హిందూ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకొని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వర్మికంపోస్టు తయారీపై అవగాహన కార్యక్రమం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షన్ మిషన్ గ్రామీణ్ లో భాగంగా పాల్వంచ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర చెత్త మరియు వర్మి కంపోస్ట్ ఎలా తయారవుతుంది అనే విషయం మీద అవగాహన కల్పించడం జరిగింది. ఈ అవగాహనలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి డంపింగ్ షెడ్ వరకు ర్యాలీగా వెళ్లి డంపింగ్ షెడ్ లో వర్ని కంపోస్ట్ తయారు గురించి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు గురించి తడి చెత్త పొడి చెత్తను వేరు చేయడం గురించి ఎస్పీఎం నుంచి వచ్చిన రేవతి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ రవి బూర్గంపాడు ఎంపీడీవో జమాల్ రెడ్డి గ్రామపంచాయతీ సర్పంచ్ గుండి బాబురావు, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు, పాలకవర్గం సభ్యులు దుర్గ,లక్ష్మి, బత్తుల శిరీష, కరం సామ్రాజ్యం,కార్యదర్శి స్పందన, ఏపీఓ,ఈసీ టి ఏ లు ఎఫ్ఎలు, కళాశాల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ పాల్గొనడం జరిగింది.

# నిరుపేదల పట్ల సేవాభావంతో ముందుకు వస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్ మండలం బోరంచ గ్రామంలో మోమిడి జహీద బేగం కుటుంబానికి రంజాన్ పండుగ సందర్భంగా జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం అందించారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో నెలకు సరిపడా నిత్యవసర సరుకులు మరియు కొంత నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సహాయ కార్యక్రమం జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుబ్బప మచ్చేందర్ సూచనల మేరకు నిర్వహించబడింది. గ్రామంలోని పేద కుటుంబాలకు తోడ్పాటు అందిస్తూ వారి జీవన విధానాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిందోల్ సంగారెడ్డి, మొట్లకుంట నర్సింలు, అలాగే జీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు అభి పవర్, చాకలి సత్యన్న, కొత్తకపు పాండురంగారెడ్డి, పుట్టి శివన్న, పాలడుగు రాములు, పాలడుగు పండరి, విఠల్, మొట్లకుంట లింగం, బదర్గం లింగం, బెయింట్ల మోహన్, జంగం రుద్రయ్య, దేవనూర్ మాణిక్యయ్య, చాకలి మహిపాల్, చాకలి భూమయ్య, ఎర్ర శ్రీశైలం, పేదనోళ్ల మల్లేష్, బొక్క ఇస్మాయిల్, డాంగే అయ్యము, చెట్టుకింది సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్‌తో కలిసి ప్రియాంక గాంధీని కలిసిన: జహీరాబాద్ ఎంపీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, సంగారెడ్డి ప్రతినిధి :** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షేట్కార్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కలిసి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, ప్రజలకు చేరువయ్యే విధానాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రాంతీయ సమస్యలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం వంటి ముఖ్య అంశాలను కూడా ప్రియాంక గాంధీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది. ప్రజల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తలకు మార్గదర్శకాలు వంటి విషయాలపై ఆమె సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ భేటీతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత సేవ చేసేందుకు కట్టుబడి ఉన్నామని నేతలు తెలిపారు.

# కరీంనగర్ లో విషాదం... ఎస్ఐ భార్య ఆత్మహత్య.!

- ఆత్మహత్యకు ముందు ఇద్దరి మధ్య వాగ్వాదం..ఘర్షణ.
- కరీంనగర్ పోలీస్ శాఖలో కలకలం..!





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, కరీంనగర్ :** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో టూ టౌన్ ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ భార్య దివ్య మంగళవారం ఉదయం 10గంటల సమయంలో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భార్య భర్తల మధ్య నెలకొన్న కలహాలే దివ్య ఆత్మహత్యకు కారణంగా తెలుస్తోంది. దివ్య ఆత్మహత్యకు కొద్ది సమయం ముందు భార్య భర్తల మధ్య వాగ్వాదం.. ఘర్షణ చోటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. దివ్య ఆత్మహత్యకు చంద్రశేఖరే కారణమంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. గన్నేరు పప్పుతో పాటు విషం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దివ్య స్వస్థలం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతం పేట స్వగ్రామం.

# గాయని పబ్బోజు శోభారాణికి ఘన సత్కారం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట గ్రామానికి చెందిన ప్రముఖ గాయకురాలు పబ్బోజు శోభారాణికి హైదరాబాదులో ఘన సత్కారం లభించింది. స్ఫూర్తి ఆర్ట్స్ వర్ధిని ప్రియ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈ అరుదైన గౌరవం ఆమెకు దక్కింది. ఈ కార్యక్రమంలో సినీ రాజకీయ వ్యాపార ప్రముఖులు పాల్గొని పబ్బోజు శోభారాణిని అభినందించారు

# "శిశు మరణాల తగ్గింపులో భారత్ రికార్డ్.. ఐక్యరాజ్యసమితి ప్రశంసల జల్లు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18 :** శిశుమరణాల రేటును తగ్గించడంలో భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఐక్యరాజ్యసమితి కితాబిచ్చింది. నవజాత శిశువులు, ఐదేళ్లలోపు పిల్లల మరణాల తగ్గింపులో భారత్ నిరంతరంగా పెద్ద ఎత్తున కృషి చేసినట్లు తాజాగా ఐక్యరాజ్యసమితి ఇంటర్-ఏజెన్సీ గ్రూప్ ఫర్ చైల్డ్ మార్టాలిటీ ఎస్టిమేషన్ 2025 నివేదిక వెల్లడించింది. ఈ విషయంలో భారత్ చేపట్టిన భారీ స్థాయి ఆరోగ్య సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. గడిచిన రెండు దశాబ్దాలుగా దక్షిణాసియా ప్రాంతంలో శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిందని, 1990తో పోలిస్తే ఐదేళ్లలోపు పిల్లల మరణాలు 76 శాతం తగ్గగా, 2000 సంవత్సరం నుండి ఈ తగ్గుదల 68 శాతంగా నమోదైందని పేర్కొంది. ఈ భారీ మార్పులో భారతదేశం కీలక పాత్ర పోషించిందని ప్రశంసించింది. 2000 సంవత్సరంలో ప్రతి 1,000 మంది సజీవ జననాలకు 92 గా ఉన్న మరణాల రేటు, 2024 నాటికి 32 కి తగ్గిపోయినట్లు స్పష్టం చేసింది.

**ప్రభుత్వ పథకాలే ఈ విజయానికి పునాదులు:** చాలా వరకు శిశు మరణాలు సరైన చికిత్స లేదా నివారణ చర్యలతో అడ్డుకోవచ్చని ఈ నివేదిక స్పష్టం చేసింది. భారత్ ముఖ్యంగా నిమోనియా, అతిసారం (డయేరియా), మలేరియా, పుట్టుకతో వచ్చే ఇతర ఆరోగ్య సమస్యలను అరికట్టడంలో వ్యూహాత్మక నిర్ణయాలు అమలు చేస్తోందని తెలిపింది. భారతదేశంలో అమలవుతున్న పలు ఆరోగ్య కార్యక్రమాలు ఈ విజయానికి పునాదిగా నిలిచాయని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. సార్వత్రిక టీకా కార్యక్రమం మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరించబడ్డాయని గర్భిణీలు ఆసుపత్రుల్లోనే ప్రసవించేలా ప్రోత్సహిస్తోందని ఆసుపత్రుల్లో ప్రత్యేక శిశు సంరక్షణ కేంద్రాల ఏర్పాటును ప్రశంసించింది. భారతదేశం ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వల్ల లక్షలాది మంది చిన్నారుల ప్రాణాలు నిలబడుతున్నాయని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే భవిష్యత్తులో ఈ రేటు మరింత తగ్గే అవకాశం ఉందని నివేదిక ఆశాభావం వ్యక్తం చేసింది.

# భారత గడ్డపైనే విమానాల తయారీ.. త్వరలోనే కల నిజం కాబోతోంది

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, ఢిల్లీ డెస్క్:** ఇకపై భారత గడ్డపైనే విమానాలు తయారు చేస్తామని, త్వరలోనే కల నిజం కాబోతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఢిల్లీలోని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లో 'డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నాలెడ్జ్ సెంటర్'ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ త్వరలోనే సొంతంగా విమానాలను తయారు చేసే దిశగా అడుగులు వేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశీయంగా విమానాల తయారీ అనేది చిరకాల వాంఛ అని, 'భారతీయ వాయుయాన్ అధినియం' ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఆయన తెలిపారు. భారత్ కేవలం విమానాల నిర్వహణకే పరిమితం కాకుండా, డిజైన్, తయారీలో అంతర్జాతీయ కేంద్రంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.అలాగే 2047 నాటికి 'వికసిత్ భారత్' సంకల్పాన్ని సాధించడంలో సైన్స్ అండ్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తాయని, అబ్దుల్ కలాం వంటి మహనీయుల స్ఫూర్తితో యువత ఈ రంగంలోకి రావాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రస్తుతం రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రోగ్రామ్‌పై వేగంగా పనిచేస్తోందని, దీనివల్ల త్వరలోనే మేడ్ ఇన్ ఇండియా విమానాలు గగనవిహారం చేస్తాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో సాధించే పురోగతి ఆరోగ్యం, విద్య వంటి అన్ని రంగాలపై సానుకూల ప్రభావం చూపుతుందని, విమానయాన రంగంలో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్‌తో కలిసి ఖర్గేను కలిసిన జహీరాబాద్ ఎంపీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, సంగారెడ్డి ప్రతినిధి :** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షేట్కార్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కలిసి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికల దిశగా అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడం, గ్రామస్థాయి నుంచి కార్యకర్తలను చైతన్యపరిచే కార్యక్రమాలపై ఖర్గే మార్గదర్శకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై కూడా సురేష్ షెట్కర్ ఖర్గే దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ప్రజల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష చేసి, మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది.ఈ భేటీతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని నేతలు తెలిపారు.

# సరస్వతీ విద్యాలయంలో ఘనంగా 35వ వార్షికోత్సవం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** ఘనంగా సరస్వతీ విద్యాలయం 35వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత సింగర్ అభినయ శ్రీనివాస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) సరస్వతి విద్యాలయంలో వార్షికోత్సవ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల వేషధారణతో మంచి డ్యాన్సులు నాటికలు వేసి అలరించారు. అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని క్రమశిక్షణ అలవాటు చేసుకుని సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలని రేపటి దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని అన్నారు. అదేవిధంగా పాఠశాల కరస్పాండెంట్ తౌర్ర విష్ణు, ప్రిన్సిపల్ పంజాబ్ నరసయ్య గౌడ్ మాట్లాడుతూ మా పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో మంది ప్రస్తుతం డాక్టర్స్ గా పోలీసులుగా. చాలా మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు గా ఇంకా మంచి మంచి ఉన్నత స్థానాలలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐలయ్య, ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్, మాజీ సర్పంచ్ జన్నాయకోడె నగేష్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, యాస లక్ష్మా రెడ్డి, గుండెగాని ఐలయ్య గౌడ్,ఎన్.వై.ఎం. అధ్యక్షులు మురళీకృష్ణ, మురారిశెట్టి మల్లేశం, ప్రభాకర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బూడిద శేఖర్ గౌడ్ పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ చట్టం పై వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి : రాజపేట ఈనెల 23వ తేదీ నుండి రాజపేట మండలంలోని అన్ని గ్రామాల వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ చట్టం పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగవేణి, ఎంపీఓ ఆవుల కిషన్ తో కలిసి బుధవారం విలేకరులకు వివరాలు చెప్పారు. మండలంలోని 23 గ్రామపంచాయతీలలో 205 మంది వార్డు సభ్యులు ఉండగా రెండు గ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపుకు ఆరు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈనెల 23వ తేదీ నుండి 28వ తేదీ వరకు మొదటి బ్యాచ్ కు శిక్షణ ఇవ్వనున్నట్లు, 30వ తేదీ నుండి వచ్చే నెల ఏప్రిల్ 4వ తేదీ వరకు రెండవ బ్యాచ్కు అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీవో వివరించారు. మొదటి విడతలో 102 మందికి, రెండవ విడతలో 103 మందికి వార్డు సభ్యులకు శిక్షణ ఉంటుందన్నారు. మొదటి విడత రఘునాథపురం, చల్లూరు, దూదివెంకటాపురం, సోమవారం, కాల్వపల్లి, కొత్తజాల, బేగంపేట, మల్లగూడెం, బొందుగుల, పారుపల్లి, బూరుగుపల్లి గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు శిక్షణ పొందుతారని, రెండవ విడతలో జాల, కొండ్రెడ్డి చెరువు, కుర్రారం, లక్ష్మక్క పల్లి, బసంతాపురం, నరసాపురం, పాముకుంట, పుట్టగూడెం, రాజాపేట, రేణిగుంట, సింగారం, నమిల గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు శిక్షణ పొందుతారని రాజపేట మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. వార్డు సభ్యులందరూ ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## బొందుగుల లో కుర్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలం బొందుగుల గ్రామంలో కుర్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడుగా బండ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడుగా మర్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి గవ్వల బాలయ్య, సహాయ కార్యదర్శి బాల్ద భాను, కోశాధికారి బల్ల పెద్దా బాపు, కార్యవర్గ సభ్యులుగా మర్ల పెద్దమల్లేశం, బాల్ద కరుణాకర్, బుగ్గ కరుణాకర్, బాల్ద కనక రాజు, మాపు చిన్న సిద్ధులు, జెట్టా ఆంజనేయులు ఎన్నికయ్యారు.

## ప్రభుత్వ భూమి కబ్జా, అక్రమ ఇంటి నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వినతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** అక్రమ ఇంటి నిర్మాణం గురించి, ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజపేట మండలం జాల గ్రామపంచాయతీ సర్పంచి వార్డు సభ్యులు గ్రామ పెద్దలు బుధవారం కలెక్టర్ అనురాగ్ జయంతి కి వినతి పత్రం అందజేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన కట్టడాలను ఆపివేయాలని, కొత్త ఇంటి నిర్మాణం చేపట్టిన ఎటువంటి కొత్త కట్టడాలైనా గ్రామ పంచాయతీ యొక్క అనుమతితో నిర్మించుకోవాలని నూతన పాలకవర్గం కలెక్టర్ కి వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంధమల్ల నవనీత నరసింహులు, ఉప సర్పంచ్ కొల్లూరి లావణ్య కర్ణాకర్, వార్డు సభ్యులు ఠాగూర్ భగత్ సింగ్, కొల్లూరి సౌజన్య, నరేష్, కొండం ధనమ్మ, బత్తుల బాలయ్య, కొండ ముత్యంరెడ్డి, దొమ్మాట లక్ష్మి, కొన్యాల పరమేశ్వర్ రెడ్డి, గుంటి మదుసుధన్ రెడ్డి, పారుపల్లి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిఓటి చట్టాన్ని రద్దు చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ని కలిసి ఆలేరు పట్టణం మరియు మండల పరిధిలో ఉన్న సుమారు 1600 వంధల పేద ప్రజల ఇళ్ల స్థలాలను మరియు భూములను 22-ఎ చట్టం 1908, పిఓటి చట్టం 1977 పేరుతో ప్రోహిబిటెడ్ జాబితాలో చేర్చగా వాటిని పిఓటి చట్టాన్ని రద్దు చేసి భూములను రెగ్యులర్ చేయాలని కలెక్టర్ కి వినతిపత్రాన్ని అందజేసిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మరియు ఆలేరు పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్ గౌడ్, మాజీ ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గ్యాదపక నాగరాజు, మాజీ ఎంపిటిసి రాం నర్సయ్య, ఆలేరు 1వ వార్డు కౌన్సిలర్ కొమ్మల మౌనిక హరీశ్, 3వ వార్డు కౌన్సిలర్ యాట శివ, 4వ వార్డు కౌన్సిలర్ బీజని కళ్యాణి మధు, ఎండీ ఫయాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు




## వినియోగదారులకు తీపికబురు..
# దేశంలోనే తొలి 'ఎల్.పి.జి గ్యాస్ ఏటీఎం' షురూ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 18, వెబ్ డెస్క్:** గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తీపికబురు చెప్పింది. సిలిండర్ బుక్ చేసి రోజుల తరబడి వేచి చూసే అవసరమే లేకుండా, ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసినంత సులభంగా ఇకపై గ్యాస్ సిలిండర్లను పొందే సదుపాయాన్ని కల్పించారు. ఈ మేరక నార్త్ ఇండియాలో మొదటి 'ఎల్పీజీ గ్యాస్ ఏటీఎం' హర్యానాలోని గురుగ్రామ్‌లో ప్రారంభమైంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గురుగ్రామ్‌లో సోహ్నా, సెక్టార్ 33లోని 'సెంట్రల్ పార్క్ ఫ్లవర్ వ్యాలీ'లో ఈ స్మార్ట్ వెండింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసింది.

**ప్రధాన ప్రయోజనాలు ఇవే..**

అయితే, ఈ 'ఎల్పీజీ గ్యాస్ ఏటీఎం' మిషన్ రోజులో 24 గంటలూ పనిచేస్తుంది. డెలివరీ బాయ్ ఎప్పుడు వస్తాడా అని వేచి చూడాల్సిన అవసరం లేదు. కేవలం రెండు నుంచి మూడు నిమిషాల వ్యవధిలోనే ఖాళీ సిలిండర్ ఇచ్చి నిండు సిలిండర్‌ను పొందవచ్చు ఈ ఏటీఎం ద్వారా 'కాంపోజిట్ సిలిండర్లను' అందిస్తున్నారు. ఇవి సాధారణ ఇనుప సిలిండర్ల 31 కేజీలు కంటే అందులో సగం బరువు అంటే సుమారు 15 కేజీలు మాత్రమే ఉంటాయి. ఈ సిలిండర్లు పారదర్శకంగా ఉండటం వల్ల లోపల గ్యాస్ ఎంత ఉందో వినియోగదారులు నేరుగా చూసుకోవచ్చు.

**సిలిండర్ ఇలా ఎలా తీసుకోవాలంటే..**


ముందుగా 'ఎల్పీజీ గ్యాస్ ఏటీఎం' మిషన్ వద్ద వినియోగదారులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాలి. అనంతరం మొబైల్‌కు వచ్చే ఓటిపి ని ఎంటర్ చేసి వెరిఫై చేయాలి. ఖాళీ సిలిండర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. యూపీఐ లేదా డెబిట్ కార్డ్ ద్వారా డిజిటల్ పేమెంట్ పూర్తి చేయాలి. పేమెంట్ పూర్తయిన వెంటనే మిషన్ నుంచి నిండు సిలిండర్ బయటకు వస్తుంది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న గ్యాస్ కొరత దృష్ట్యా వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ఈ వినూత్న ప్రయోగాన్ని చేపట్టారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే త్వరలోనే దేశవ్యాప్తంగా మరిన్ని నగరాల్లో ఈ ఏటీఎంలను ఏర్పాటు చేయనున్నారు.




## మాస శివరాత్రి సందర్భంగా
# పరమశివుడికి ప్రత్యేక పూజలు









**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 18, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి సందర్భంగా పరమశివుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని సాంప్రదాయంగా ఘనంగా జరిపారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ మంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రంగ నరసింహులు లక్ష్మి పుణ్య దంపతులు, ఉప్పల రమేష్ స్వప్న దంపతులు సాంప్రదాయ దుస్తులతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులు జై శ్రీమన్నారాయణ భక్త బృందం శ్రీ స్వామివారికి పంచామృత ఫలరస అభిషేకాలు స్వయంగా చేశారు. లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తి పాటలతో మంగళహారతులతో స్వామిని కొలిచారు. అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ భక్తులకు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేసి మాస శివరాత్రి వేడుకల విషయాలను పాల్గొన్న భక్తులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ భక్తి కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ బల్ల దామోదర్ వరలక్ష్మి పుణ్య దంపతులు, డాక్టర్ బోగ జ్ఞానేందర్, నంగునూరు రాజు, చామకూర భద్రయ్య, కూనూరు బిక్షపతి, భోగ లతా, బిర్రు భాగ్యలక్ష్మి, నాళ్ల పద్మ తదితరులు ఉన్నారు.

# ముగిసిన మొదటి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం.....!

- **మున్సిపల్ అభివృద్ధి మా ఎజండా**
- **పాలకవర్గంతో చర్చించాకే పనులు చేపడతాం**
- **మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్**
- **సమావేశంలో పాల్గొన్న కమిషనర్, కౌన్సిలర్లు**

**జహీరాబాద్ మార్చ్ 18 హైదరాబాద్ పల్స్ న్యూస్ :** సంగారెడ్డి జిల్లా జైరాబాద్ నియోజకవర్గం కోహిర్ మున్సిపాలిటీలో, మొదటి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం కోహిర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీలోని 16వార్డులకు సంబందించిన కౌన్సిలర్లు పాల్గొని వారి వార్డు సమస్యలను మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకరావడంతో స్పందించిన మున్సిపల్ చైర్మన్ నూతన మున్సిపాలిటీ కావడంతో పనులు కొద్దిగ ఆలస్యం అవుతుంది అన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులు ప్రతి వార్డు కౌన్సిలర్ కు వార్డులవారిగా సమాచారం అందిస్తామని అన్నారు. మున్సిపాలిటీలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. నూతన మున్సిపాలిటీ కావడంతో నూతన భవన నిర్మాణం చేపట్టే ప్రణాళికలు చేపట్టమని అన్నారు. మున్సిపాలిటీకి సంబంధించి త్వరలో నియామకాలు చేపడతామని జిల్లా కలెక్టర్, జహీరాబాద్ ఎంపీ తెలిపారని అన్నారు. రాబోయే కొన్నిరోజుల్లో నియామకాలు చేపట్టడానికి మరోసారి అధికారులను అభ్యర్టిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్, 16వార్డుల కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.



# కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు ఉగాది వేడుకలు

**పటాన్చెరు/ఇస్నాపూర్ మున్సిపాలిటీ,మార్చి 18 హైదరాబాద్ పల్స్ న్యూస్ :** పటాన్చెరు మండలం ముత్తంగి గ్రామంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో బుధవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను యువతరానికి తెలియజేసి నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి దోహదపడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి .హెచ్ రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి ప్రాముఖ్యత, తెలుగు నూతన సంవత్సర విశిష్టత పై వివరణలు ఇస్తూ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. సాంప్రదాయ వేషధారణలో విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి విలువలను అలవరుచుకోవాలని, అదే నిజమైన విద్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చురుకుగా పాల్గొనగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తూ సహకరించారు. మొత్తం మీద ఈ వేడుకలు విద్యార్థుల్లో సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందించేలా విజయవంతంగా నిర్వహించబడ్డాయి.





# పవన్ డైలాగ్‌తో రాశీఖన్నా ప్రచారం..



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. దర్శకుడు హరీశ్ శంకర్‌తో పవన్ చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఉగాది పండుగ కానుకగా ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడటంతో చిత్రయూనిట్ ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ముఖ్యంగా ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌ను వాడుతూ చేస్తున్న ప్రచారం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.సినిమాలోని 'ఇచ్చిపడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం' అనే డైలాగ్ విడుదలకు ముందే ట్రెండింగ్‌లో నిలిచింది. ఇదే డైలాగ్‌ను ప్రచారానికి వాడుకుంటూ చిత్రబృందం సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ ప్రమోషన్లలో భాగంగా నటి రాశీఖన్నా ఓ వినూత్నమైన స్టైల్‌లో కనిపించారు. నలుపు రంగు షర్ట్ వెనుక ఈ డైలాగ్‌ను ప్రింట్ చేయించుకుని, ఆ షర్ట్‌తో ఆమె ప్రమోషన్లలో పాల్గొంటున్నారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా, రాశీఖన్నా కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు స్వరపరచగా, ఎస్. థమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. సినిమాలో పార్థిబన్, గౌతమి, కేఎస్ రవికుమార్ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

# హీరోల ఆలోచనా విధానంపై తాప్సీ విమర్శలు



బాలీవుడ్ 'ఫైర్ బ్రాండ్' తాప్సీ పన్ను తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా అగ్ర హీరోల అభద్రతా భావం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.తాప్సీ తన తాజా ఇంటర్వ్యూలో హీరోల ఆలోచనా విధానాన్ని ఎండగట్టింది.

కథానాయికలకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్లో నటించడానికి చాలా మంది స్టార్ హీరోలు సిద్ధంగా లేరని ఆమె విమర్శించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని తాప్సీ పంచుకుంది."ఒక సినిమాలో నేను డబుల్ రోల్ చేస్తున్నప్పుడు, సదరు హీరో ఆ ప్రాజెక్ట్‌ను రిజెక్ట్ చేశాడు. దానికి ఆయన చెప్పిన కారణం ఏంటంటే.. సినిమాలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ నిడివి, ప్రాధాన్యత ఉంటే చివరకు ప్రేక్షకుల సానుభూతి, ప్రశంసలు ఆమెకే దక్కుతాయని ఆయన భయపడ్డాడు. అంతకుముందే ఆ హీరోతో తాను కలిసి పనిచేసినప్పటికీ... కేవలం తన పాత్రకు ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే అభద్రతా భావంతో ఆయన వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది" అని తాప్సీ వెల్లడించింది.కేవలం సీనియర్ హీరోలే కాదు, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరో పాత్ర నిడివి తక్కువగా ఉంటే అటువంటి సినిమాలకు దూరంగా ఉంటున్నారని ఆమె విమర్శించింది. హీరోయిన్ డామినేట్ చేస్తుందనే భయంతో మంచి కథలను వదులుకోవడం వల్ల చిత్ర పరిశ్రమలో సమానత్వం అనేది ప్రశ్నార్థకంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం తాప్సీ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# 'సర్కే చునారే తేరీ సర్కే' పాట..

## క్షమాపణలు చెప్పిన గాయని మంగ్లీ

'సర్కే చునారే తేరీ సర్కే' పాట వివాదంపై ప్రముఖ గాయని మంగ్లీ స్పందించారు. తాను పాడిన ఈ పాట వివాదాస్పదం కావడంతో ఆమె క్షమాపణలు చెప్పారు. కన్నడ సినిమా 'కేడీ: ది డెవిల్' చిత్రంలోని ఈ పాటకు సంబంధించిన సాంగ్ లిరికల్ వీడియోను విడుదల చేశారు. హిందీ పాటపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అసభ్యకర పదాలు ఉండటంపై అందరినుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ పాటను మంగ్లీ పాడారు.ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, ప్రజల మనోభావాలను గౌరవిస్తూ అన్ని ప్లాట్‌ఫామ్స్ నుంచి ఈ పాటను తొలగించినట్లు తెలిపారు. ఇది అనుకోకుండా జరిగిన పొరపాటు అని, అయినప్పటికీ క్షమాపణలు కోరుతున్నానని సామాజిక మాధ్యమ వేదికగా పోస్టు పెట్టారు. ఎవరి మనోభావాలు దెబ్బతీయాలనే ఉద్దేశం తమకు లేదని తెలిపారు. లిరిక్స్‌లో మార్పులు చేశామని, ఈ పాట త్వరలో విడుదలవుతుందని వెల్లడించారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరగదని పేర్కొన్నారు.

# 'ధురంధర్ 2'పై ఆర్జీవీ సంచలన రివ్యూ..

## ఆ సినిమాలు ఇక టీవీ సీరియళ్లేనట!

వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రాబోతున్న 'ధురంధర్ 2' చిత్రంపై ఆయన తన తొలి రివ్యూను ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. ఈ సినిమా ఒక కొత్త సినీ శకానికి నాంది పలుకుతుందని, దీని దెబ్బకు ఇప్పటివరకు వచ్చిన గొప్ప చిత్రాలన్నీ టీవీ సీరియళ్లలా కనిపిస్తాయని జోస్యం చెప్పారు."నిన్న రాత్రి ధురంధర్ 2 చూశాక చెబుతున్నా.. వసూళ్లు, ప్రేక్షకుల స్పందన, సామాజిక ప్రభావం, సినిమా వ్యాకరణం.. ఇలా ఏ రకంగా చూసినా ఇది 'షోలే' చిత్రానికి 100 రెట్లు గొప్పగా ఉంటుంది. 'మొఘల్-ఎ-ఆజం' నుంచి ఇప్పటివరకు వచ్చిన గొప్ప సినిమాలన్నీ ఈ చిత్రం ముందు టీవీ సీరియళ్లలా కనిపిస్తాయి" అని వర్మ తన పోస్టులో పేర్కొన్నారు.ఇది పాత సినిమా ప్రపంచాన్ని పూర్తిగా అంతం చేసి, ఒక కొత్త సినీ శకాన్ని ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఇకపై డైరెక్టర్ అనే పదానికి అర్థం ఆదిత్య ధర్ పేరుతో మొదలవుతుంది. స్టీవెన్ స్పీల్‌బర్గ్, క్రిస్టోఫర్ నోలన్ లాంటి వారు కూడా తమ పనులన్నీ పక్కనపెట్టి ఫస్ట్ డే ఫస్ట్ షో ఈ సినిమా చూడటం మంచిది" అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా బాక్సాఫీస్ లెక్కలపై కూడా వర్మ తన అంచనా తెలిపారు. ఒకవేళ 'ధురంధర్ 2' చిత్రం రూ. 1,500 నుంచి రూ. 2,000 కోట్లు వసూలు చేస్తే, ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కొనసాగుతున్న దక్షిణాది చిత్రాల ఆధిపత్యానికి గండి పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.





Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.